# కరిమింగిన వెలగపండు

''సారథీ ... సారథీ...''

అని ఎవరో పిలుస్తున్నట్లనిపిస్తే వెనక్కి తిరిగి చూశాను. ఓ స్త్రీ, ముప్పై అయిదేళ్ళుంటాయేమో, బొద్దుగా వుంది - పిలుస్తోంది. పక్కన ముగ్గురు పిల్లలు. పెద్ద పిల్లవాడికి పన్నెండేళ్ళుంటాయి. మిగతా ఇద్దరు ఆడపిల్లలూ చిన్నవాళ్ళు. ఎంతో దూరం నుండి వస్తున్నట్టున్నారు. రైలు ప్రయాణంలోగుడ్డలు మాసినట్టున్నాయి ముఖాలు కడుక్కున్నట్లున్నా ప్రయాణపు దుమ్ము ఇంకా పూర్తిగా పోలేదు. జుట్టు దువ్వుకోక వెంట్రుకలు లేచి వున్నాయి.

''ఎవరూ?!'' అంటూ నేను ఆమెదగ్గరికెళ్ళాను. 'ఎవరీమె?' అని జ్ఞాపకపు పుటలు తిరగేస్తున్న మెదడు ఆ లావాటి ఆకారంలో ఒకప్పటి నా ప్రేయసి రోహిణి- సన్నగా, రివటలా, బంగారు శలాకలా, ఉధృతంగా ప్రవహించే ఝరిలా వుండే నా ఒకప్పటి రోహిణి-ని సుదూరంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నది.

''ఓ మీరా...?'' అన్నాను మీరనాలో, నువ్వనాలో తెలియని సందిగ్ధతలో.

''రండి... కూర్చోండి...'' అంది రోహిణి బెంచీమీద నాకు జాగా చూపిస్తూ.

విజయవాడ రైల్వే ప్లాట్‌ఫారం విపరీతమైన రద్దీగా వుంది. ఇంకా హైదరాబాదు నుండి రావాల్సిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రాలేదు. చందూ దాంట్లో వస్తున్నాడని టెలిగ్రాం ఇస్తే అతణ్ణి రిసీవ్ చేసుకోటానికి స్టేషనుకొచ్చాను.

''గుంటూరు వెళ్తున్నారా?'' అనడిగాను.

''అవును... భువనేశ్వర్‌నుండి వస్తున్నాం. హౌరా-మద్రాసు మెయిలు 7-40కి రావాల్సింది గంట ఆలస్యంగా వచ్చింది. తొమ్మిదికి గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వుందిగా. దాంట్లో వెళ్తాం. అమ్మావాళ్ళను చూసి చాలాకాలమయింది. పిల్లలకెలాగూ సెలవలేకదా అని బయలుదేరాను'' అంది రోహిణి.

''పాతగుంటూరులోనే వుంటున్నారా వాళ్ళు ఇంకా?'' అనడిగాను.

''అవును... .సొంతిల్లేకదా! అన్నయ్య కలెక్టరేట్‌లోనే వున్నాడు. వాడికీ ఇద్దరు పిల్లలు. మా పిల్లల్ని పరిచయం చెయ్యలేదుకదూ! వీడు పెద్దాడు - విజయసారథి, అది శారద, చిన్నది రమ. పిల్లలూ - అంకుల్‌కి నమస్తే చెప్పండి'' అంది.

''నమస్తే.... నమస్తే అంకుల్'' అన్నారు వాళ్ళు.

నన్ను మర్చిపోలేని ఆమె నాపేరు కొడుక్కు పెట్టుకున్నట్టుంది. 'అది నాపేరేనా' అని అడిగే ధైర్యంలేదు నాకు.

''గుర్తుపట్టలేకపోయాను మిమ్మల్ని. చాలా మారిపోయారు'' అన్నాను.

''అవును... చాలా ఏళ్ళయిందికదా మిమ్మల్నిచూసి - పదిహేను ఏళ్ళయిందా?'' అడిగింది రోహిణి.

''అవును... డెబ్బై రెండులోకదా మీపెళ్ళయింది. పెళ్ళిలో చూడటమే. మళ్ళీ కలవటంపడలేదు'' అన్నాను.

''మీ పెళ్ళయిందా? ఎంతమంది పిల్లలు?'' అడిగింది రోహిణి.

''అయింది.... ఇద్దరు'' అన్నాను, అంత కంటే సమాధానం చెప్పటం ఇష్టంలేక.

సంభాషణ చాలా కష్టంగా సాగుతోంది. తరవాతేం మాట్లాడాలి. 'మోసం చేశావునన్ను నువ్వు వట్టి ధూర్తుడివి అని తిట్టదేం' ఈమె.

''మీ నాన్నగారు, అమ్మగారు బావున్నారా?'' అడిగాను.

''బాగానే వున్నారు'' అంది.

ఇంకేం మాట్లాడాలో తోచక పిల్లలకేమయినా పళ్ళు కొనిద్దామని ''ఇప్పుడేవస్తాను'' అని చెప్పి పళ్ళదుకాణంవైపు నడుచుకుంటూ వెళ్ళాను.

గడచిన కాలంలోని మన మిత్రులు, పరిచయస్థులు చాలా కాలంతర్వాత కలిస్తే కొత్తవాళ్ళయి పోతారులాగుంది. లేక అప్పటి పరిచయానికి పేలవమైన మూర్తులుగా, రూపాలుగా వుండిపోతారేమో. లేకపోతే నాకూ, రోహిణికీ మధ్య ఇలా మాటలు కరువ వ్వటమేమిటి? ఎన్ని సాయంత్రాలు ఎన్ని స్వీట్ నథింగ్స్ చెప్పుకున్నాం. కాలం ఎలా తెలీ కుండా గడచిపోయేది? అప్పటి మాటలతో నిండినరోజులు స్మృతిపథంలో మెదిలాయి నాకు.

నేను బి.ఎ., బి.ఎడ్ పాసయి హిందూకాలేజీ హైస్కూలు, గుంటూరులో ఉద్యోగానికి వచ్చిన కొత్తలో, అద్దెకు గది దొరుకుతుందేమోనని ప్రయత్నిస్తున్నాను. మా స్కూల్లోనే పనిచేసే రామనాథంగారు పాతగుంటూరులో వుంటారు. ఆయనే తమ ఇంటికి దగ్గరగా ఓ ఇంట్లోగది ఖాళీగా వుందనీ, లొకాలిటీ పాతదీ, మురికిగా వుంటుందన్న అభ్యంతరం లేకపోతే ఆ గది ఇప్పిస్తాననీ అన్నాడు. అప్పటికింకా సరిగ్గా నాకావూరు తెలీదు. పుట్టి పెరిగిన రాజమండ్రి వదలి రావటం నాకదే ప్రథమం. అందువల్ల నేనేం అభ్యంతరాలు తెల్పకుండా రామనాథంగారు చూపించిన గదిలో ప్రవేశించాను. ఆ ఇంటివారి అమ్మాయే రోహిణి.

లేవగానే కాఫీ కావాలి నాకు. అందుకు బయటకు హోటలుకెళ్ళాలి. అయితే పొద్దున

స్నానంచేయకుండా బయటకెక్కడికీ కదలటం నాకిష్టముండదు. పక్కచుట్టేసి, ఇంటిపక్కగా వెళ్ళి పెరడులో బావిదగ్గరకు చేరాను. ఆ వూళ్ళో నదికాదుగదా, పిల్లకాలువకూడా లేదు. చచ్చినట్లు బావిదగ్గర స్నానం చేయాల్సిందే. రాజమండ్రిలో గోదావరిలో స్నానంచేసే నాకు ఈ బక్కెట్టునీళ్ళ స్నానం బాగనిపించదు. దంతధావనం కానిచ్చి, లుంగీమీదే స్నానం చేయనారంభించాను. బక్కెట్లు తోడుతున్నాను, పోసుకుంటున్నాను.

''మీ స్నానం ఇప్పట్లో తెమిలేనా?'' అని విన్పించి వెనక్కి తిరిగిచూశాను. లంగా, వోణీలో బంగారు విగ్రహం. ఇంటివారమ్మాయి అని గ్రహించాను. బిందెపట్టుకుని నేనెప్పుడు స్నానం పూర్తిచేస్తానా అని ఎంతసేపటి నుండి ఎదురుచూస్తోందో తెలీదు.

''ఏదండీ - ఇప్పుడేకదా మొదలెట్టాను'' అన్నాను ఆమెను వుడికించాలనే చిలిపి ఊహ మనసులో ప్రవేశించగా.

''అరగంట నుండీ చూస్తున్నాను. బక్కెట్టు తోడటం పోసుకోవటం - ఇలా అయితే మా బావి ఖాళీ అయిపోతుంది. ఇహ మేం నీళ్ళెక్కడ దొరుకుతాయా అని పొరుగిళ్ళకు వెళ్ళాల్సొస్తుంది'' అందామె.

''అయ్యో... అలాగాండీ - ఈ ఊళ్ళో అంత నీళ్ళ కరువాండీ?''

''అవునండీ... అలాగేనండీ'' అంది ఆమె. నా తూర్పుగోదావరి జిల్లాభాషలో యాసను అనుకరిస్తూ, వెక్కిరిస్తూ.

''అయ్యోపాపం! మీ ఊళ్ళోవాళ్ళకు ఎన్ని కష్టాలొచ్చాయండీ'' అన్నాను.

''ఏం కష్టాలొచ్చాయి?''

''ఏదీ - అవసరానికి ఆత్మహత్య చేసుకుందామన్నా ఏబావిలోనూ మొలబంటి నీళ్ళయినా వున్నట్టులేవు, పాపం.''

''ఇక్కడెవరికీ అలాంటి అవసరాలు రావు. మీకలాంటి అవసరమొస్తే మీ ఊరెళ్ళండి. అంతేగానీ - పోనీ సర్దుబాటు చేసుకుందామని మాబావిలో దిగకండి, మీకు పుణ్యముంటుంది''

''మీలాంటి చక్కటి సలహాలిచ్చే చుక్కలున్న తరువాత అలాంటి అవసరాలు ఎందుకొస్తాయిలెండి - ఎవరికయినా'' అన్నాను.

''ఇంక అక్కడనుండి లేస్తారా లేదా?'' అందామె బిందెత్తి. దాంతో నన్ను మోదుతుందా అనిపించింది.

''అరె... పొద్దున్నే చన్నీళ్ళ స్నానం చేస్తున్నావు. నీకన్నీ మంచి అలవాట్లు వున్నట్టున్నాయయ్యా!'' అన్నాడు ఇంటి యజమాని పరంధామయ్యగారు పందుంపుల్ల నోట్లో పెట్టుకుని బావిగట్టుమీదకు వస్తూ.

''అట్లాగే కనిపిస్తోంది నాన్నా! ఈయన ఈ పద్ధతిలో మరి రెండునెల్లు స్నాన కార్యక్రమం నిర్విఘ్నంగా నెరవేరిస్తే, మన బావి వట్టిపోవటం ఖాయం'' అందామె బావిలో చేదవేస్తూ.

ఆయన నవ్వాడు.

''నువ్వేమనుకోకు నాయనా! మా అమ్మాయి పనికి అడ్డమొస్తే చికాకుపడ్తూ వుంటుంది'' అన్నాడు.

అలా పరిచయమైంది రోహిణితో. ఆమెను చూసినప్పటినుండి ఆమెతో పరిచయం పెంచుకోవాలనే తహతహ మొదలైందినాలో. అయితే ఎలాగో తోచలేదు. ఆమె విమెన్స్ కాలేజీలో బి.యస్.సి. చదువుతూవుండేది. తొమ్మిదిగంటలకు ఇంటినుండి బయలుదేరేది కాలేజీకి. నేను ముందే ఇంట్లోనుండి బయలుదేరి బయట పాన్‌షాపు దగ్గర ఆమెరాకకై వేచిచూస్తూ వుండేవాడిని. ఆమె బయలుదేరగా, వెనక నేను వెళ్ళేవాడిని. జిన్నాటవర్ దాకా ఆమెని అనుసరించి, ఆపైన స్కూలుదారిపట్టేవాడిని. ఇలా బాడీగార్డులా వ్యవహరించటం రెండురోజులు చూసినట్టుంది. మూడోరోజు నన్ను నిలేసింది.

''రెండు రోజులబట్టీ చూస్తున్నాను, నావెనకే వస్తున్నారు... ఏంటీ కథ?'' అందామె తీక్షణంగా నావంకచూస్తూ.

''పాత కథే... నేను స్కూలుకు వెళ్తున్నాను''

''నా వెనకేరావాలా? మీకిల్లాంటి బుద్ధులున్నాయన్న సంగతి తెలిస్తే మేం మీకసలు గది అద్దెకిచ్చేవాళ్ళంకాదు.''

''నిజమే... వెనకరావటం నాతప్పే. ఇక నుండి రోజూ జిన్నాటవర్‌దాకా కలిసే వద్దాంలెండి'' అన్నాను.

''కలిసి రావాలా? చూసేవాళ్ళేమనుకుంటారు?''

''ఏమనుకుంటారు... మీరు కాలేజీకి, నేను స్కూలుకు వెళ్తున్నామనుకుంటారు.''

''మీ బుర్రనిండా మట్టేవున్నట్టుంది.''

''మా బాగా గమనించారు. అది పోవటానికేగా రోజూ అన్ని బక్కెట్ల స్నానంచేసేది. అయినా కలిసొస్తే ఏం పోయింది. పరిచయం పెరుగుతుంది. ఒక్కళ్ళనొకళ్ళు అర్థం చేసుకుంటాం. ఇహ ఆపైన అన్నీ కలిసొస్తే...''

''మరీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా వుందే మీ వ్యవహారం.''

''అవునూ... మీ పేరు రోహిణి కదూ!''

''ఎంక్వైరీ మొదలెట్టారన్నమాట.''

''అన్నమాటేమిటి- ఉన్నమాటే. మీరు బి.యస్.సి. రెండో సంవత్సరం బి.జడ్.సి. గ్రూపుతో చదువుతున్నారు. వయసు 18 ఏళ్ళు. ఐదడుగల రెండంగుళాల ఎత్తుంటారు. మెజర్‌మెంట్స్... వద్దులేండి'' అని ఆమె కళ్ళురుచేయటం చూసి ఆగాను.

ఆమె ఏం మాట్లాడకుండా చరచరా వెళ్ళి పోయింది.

ఆరోజు స్కూలు వదిలింతరువాత ఇంటికి బయలుదేరాను. ఆకాశం మేఘావృతమై వుంది. ఏక్షణంలోనయినా వానరావచ్చు. వానరాకముందే గది చేర్తే మంచిదని బయలుదేరాను. స్కూలు దాటానోలేదో పెద్దగా వర్షం ప్రారంభమైంది. తడవకుండా నిలబడదామని మాస్కూలు పక్కనే వున్న కూరల మార్కెట్టులోకి పోయాను. రోహిణి బయటకు రాబోతూ వాననిచూసి ఆగిపోవటం కన్పించింది. రెండు చేతుల్లో రెండు సంచులు, ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తున్నట్టుంది.

''హాయ్... రోహిణీ...'' అని పలకరించాను.

''ఏం ఇలావచ్చారు. కూరలు కొనాలా? పాకశాస్త్ర పరిశోధనలు మొదలెట్టాలనుకుంటున్నారా?'' అందామె.

''లేదులెండి... మీరు భయపడకండి. అలాంటి ప్రమాదకరమైన ఉద్దేశాలేం నాకు లేవు. ఇదుగో ఈ వానవుంది చూశారూ, అది మనల్ని కలిపింది'' అన్నాను.

''ఈ వానలకి మార్కెట్టంతా చీదరగా వుంది. వాన ఎప్పుడు వెలుస్తుందో ఏమో'' అంది కూరల సంచీలు పొడిగావున్న ప్రదేశంలో వుంచుతూ.

''తొందరేముంది కురవనివ్వండి''

''మీకేం, వంట చేసుకోవాల్సిన అవసరంలేదు. ఆ హోటలువాడు ఉడకేసి పెడ్తాడు. ఇవ్వాళ అమ్మకూడా ఇంట్లోలేదు. ఇంటికెళ్ళి పనులన్నీ చేసుకుని వంటవండాలి'' అంది.

''పోనీ నేను సాయంచేసి పెడ్తానులెండి''

''ఏం మా ఇంట్లో వుండాలని లేదా మీకు?''

''నేనీ ఊళ్ళోవున్నంతవరకూ మీరు పొమ్మన్నా మీ ఇంట్లోనే వుంటాను''

''అది ఎక్కువకాలం సాగేట్టు కన్పించటంలేదు లెండి''

''ఏం.... ఏమయింది?''

''మీ వ్యవహారం శృతిమించకముందే మావాళ్లకు చెప్పేస్తాను మిమ్మల్ని ఖాళీచేయించమని.''

''శృతిమించితే ఏమవుతుంది... రాగంలో పడుతుంది.''

''అరున్నొక్క రాగంలో పడకుండా చూసుకోండిచాలు.''

వాన కొద్దిగా వెలిసింది. ఇంకా తుంపర పడుతూనే వుంది.

''నేనిహవెళ్తాను'' అంది రోహిణి.

''అయ్యో- తడిసిపోతారు. కొంచెం సేపు ఆగండి'' అన్నాను.

''ఎందుకూ - మీతో కబుర్లు చెప్పటానికా?'' అంది.

''సరే పదండి... రిక్షా ఎక్కి వెళ్దురుగాని'' అని ఆమెవద్దన్నా వినకుండా రెండు సంచులూపట్టుకుని బయటకు నడిచాను.

వానవల్ల రిక్షావాళ్ళ డిమాండు ఎక్కువగా వుంది. పాత గుంటూరుకు నాల్గురూపాయలు అడిగాడు రిక్షా అతను.

''బావుంది - నాల్గురూపాయల కూరలకు. నాల్గురూపాయల రిక్షానా'' అంది రోహిణి.

''అయితే నడిచిపోవమ్మా! వాన కురుస్తోంది, మేమూ వానలో తడిసి తొక్కాలి బండి'' అన్నాడతను.

రోహిణికేం తోచలేదు. రెండు సంచుల బరువుతో నడవటం కష్టమే. మామూలుగా రూపాయికొచ్చేవాడు నాలుగడుగుతున్నాడు. అవకాశాన్ని వాళ్ళు ఎక్స్ప్లాయిట్ చేస్తున్నారు.

''ఏం చేద్దాం?'' అంది రోహిణి.

''మీరేమనకపోతే, నడచి వెళ్దాం'' అన్నాను.

''ఈ బరువులతోనా?''

''బరువుసంగతి నాకు వదిలెయ్యండి. మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళవచ్చు'' అన్నాను.

''అవును... మీకూ చక్కటి అవకాశం దొరికింది, ఈవాన, బురద, రొచ్చులో కబుర్లాడేందుకు మంచి సమయం.''

''మరేంచేస్తాను. దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలా? పోనీ ఇద్దరం ఓ రిక్షాలో వెళ్దాం. ఇద్దరికయినా నాల్గురూపాయలకతను వస్తాడు. ఇద్దరికి నాల్గురూపాయలు అంత ఎక్కువకాదు'' అన్నాను.

''ఇంకా నయం. నేనిహ మా లొకాలిటీలో తలెత్తుకు తిరగనక్కరలేదు.''

''మరయితే నడవటం కంటే గత్యంతరంలేదు'' అన్నాను.

''సరే పదండి.''

నడకసాగించాం, పైవాన పూలజల్లులా వుంది నాకు. కిందనీళ్ళు, బురద, రొచ్చూ కనిపించటంలేదు. జిన్నా టవర్కొచ్చిన తరువాత అంది రోహిణి- ''ఓ సంచీ ఇలా ఇవ్వండి. బరువంతా మీరే మోస్తున్నారు'' అని.

''ఫరవాలేదు... ఈ రెండు సంచులెంతబరువు. ఇంకెన్ని బరువులు మొయ్యాలో'' అన్నాను.

''అవును... ప్రతి మగవాడూ ఓ ఆడదానికి భర్తవుతాడు గదా! బరువులు మొయ్యటం మంచిదేలెండి. మంచి భర్త అవటానికి మీకు ట్రయినింగు అవసరం'' అంది రోహిణి.

''రోహిణీ! మిగతావాళ్ళ సంగతలావుంచు- మన సంగతి మాట్లాడు'' అన్నాను.

''మన సంగతేముంది మాట్లాడేందుకు?''

''బతుకుబరువు మనమిద్దరం పంచుకుందామా అని!''

''మీరే మోస్తున్నారుగా రెండు సంచులూ, అవిచాలవా, మీరు కనిపిస్తారని తెలిస్తే ఇంకో రెండు కూడా పట్టుకొచ్చేదాన్ని'' అంది నవ్వుతూ.

''నేను వచ్చేశాను. ఇంకెప్పటికీపోను. ఇంకెంత బరువయినా మోయగలను పక్కన నువ్వుంటే'' అన్నాను.

''లాభంలేదు.... మీకు పిచ్చి బాగా ముదిరింది''

''పెళ్ళయితే పిచ్చికుదుర్తుందంటారు''

''మావాళ్ళతో చెప్తాలెండి మీ పిచ్చికుదర్చమని.''

''అదేదో త్వరగాకానీ మరి''

''నా చదువవ్వాలి కదా''

''పెళ్ళయితే చదవకూడదనేం లేదు''

''వివాహం విద్యానాశాయ అన్నారు''

''మరి ఆ తర్వాతదికూడా చెప్పు శోభనం...''

''ఛీ పొండి....''

ఇంక నేనెక్కడపోతాను. మా ప్రేమాయణం ఉధృతంగా, ఉరవళ్ళ పరవళ్ళతో సాగింది. ఇంట్లో మాట్లాడుకునే అవకాశం లేదు. రోజూ కలిసే బయటకు వెళ్ళేవాళ్ళం. సాయంత్రం కలిసే వచ్చేవాళ్ళం. స్నేహితురాలింటికని చెప్పి సినిమాలకెళ్ళేవాళ్ళం. అప్పుడప్పుడూ ఆమె కాలేజి ఎగ్గొట్టి, నేను స్కూలుకు సెలవు పెట్టీ బయట ఊళ్ళకు పిక్నిక్‌లకు వెళ్ళేవాళ్ళం. ఓసారి సీతానగరం, ఉండవల్లి, మరోసారి కొండవీడూ, కోటప్పకొండ తిరునాళ్ళకూ, మంగళగిరి తిరుణాళ్ళకు వెళ్ళేవాళ్ళం.

ఇంట్లోచేసిన ఫలహారాలూ, పిండివంటలూ నాకు తెచ్చి ఇస్తూ వుండేది. మావాళ్ళు ఉత్తరాలు రాసినా ఎండకాలం సెలవుల్లో తప్ప నేను రాజమండ్రి వెళ్ళలేదు. ఎన్ని ఊసులు, ఎన్ని కబుర్లు - చెప్పుకొనేందుకు సమయమే చాలేదికాదు.

రెండోసంవత్సరం వేసవిసెలవులు ఇస్తారనగా, బి.యస్.సి. ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసి బయటకు వచ్చి, ఇద్దరం కల్సి బయలుదేరుతూ వుంటే అంది రోహిణి.

''ఇక కానివ్వండి పెళ్ళి ప్రయత్నాలు. ఇంక మావాళ్ళు ఆగరు. ఇప్పటికే నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు'' అంది.

''రేపటి నుండీ మాకూ సెలవులే. ఈరోజు రాత్రే వెళ్తున్నాను రాజమండ్రి. మా వాళ్ళకు చెప్తాను. మానాన్న నా మాట కాదనడు. ఆయన్ని వెంటబెట్టుకొస్తాను. ఆయనే మాట్లాడుతారు అన్ని విషయాలూ'' అన్నాను.

''ఏమో, మీరాకకోసం ఎదురుచూస్తుంటాను''

''నువ్వు ఎదురుచూడాల్సిన పనిలేదు - చూస్తూవుండు.''

అన్ని ప్రేమ కథల్లాగానే మాదీ సీదాగా నడవలేదు. నేను రాజమండ్రి వెళ్ళేటప్పటికి మానాన్న జబ్బుతో మంచం పట్టివున్నాడు. నాకు టెలిగ్రాం ఇద్దాం అనుకుంటుండ గానే వెళ్లటం జరిగింది. నేవెళ్ళిన రెండురోజులకు ఆయన పోయాడు. అంత్యక్రియలు, బంధువులు రావటం, ఆస్తి వ్యవహారాలు చూసుకోవటంతో నాకు రోహిణి గురించి ఆలోచించే తీరిక దొరకలేదు. నాన్నపోయిన దుఃఖంలో వున్న అమ్మకు రోహిణి సంగతి చెప్పలేకపోయాను. నెలరోజులు గడచిపోయాయి. జూన్ నాలుగున నాకు రోహిణి పెళ్ళి శుభలేఖ అందింది. మర్నాడే పెళ్ళి, ఎవరో సదాశివరావుతోనట. నాకేం చేయటానికీ తోచలేదు. అయినా పెళ్ళికి వెళ్ళాను. రోహిణిని వంటరిగా కలిసి మాట్లాడే అవకాశం దొరకలేదు.

ఆ సదాశివరావు ఇంజనీరు. భువనేశ్వర్‌లో ఏదో కంపెనీలో పనిచేస్తున్నాడు. రోహిణి అన్నకు, తండ్రికి ఆమెను బడిపంతులికిచ్చి పెళ్ళిచేయటం ఇష్టంలేదు. రోహిణి అన్న గోపాలం తామిద్దరూ అంతకుముందు సినిమా హాలునుండి బయటకు రావటం చూశాడట. ఆ తరువాత మా ప్రవర్తనగురించి కూపీలాగటం ప్రారంభించాడట. మా సంగతి తండ్రితో తప్ప ఇంట్లో ఎవరితోనూ అనలేదు. సదాశివరావు దూరపుబంధువే. పిల్ల పిల్లాడు చూసుకునే పనేలేదు. రోహిణి పరీక్షలవుతుండగానే కట్నం, లాంఛనాలు వగైరాలు మాట్లాడుకోవటం, పెళ్ళితేదీ నిర్ణయించుకోవం అన్నీ జరిగిపోయాయి. అయితే అంతాగోప్యం. రోహిణికేం తెలియనీయలేదు. రోహిణికి తెలిసేటప్పటికి నేను రాజమండ్రి వెళ్ళిపోయాను. ఆమె ఆ పెళ్ళివద్దని ఎంత గోల పెట్టినా ఎవరూ విన్పించుకోలేదు. నేను నెలరోజులుగా కన్పించకపోయేటప్పటికి ఆమె నిరుత్తరురాలై పోయింది. ఆ విషయాలన్నీ రామనాథం మాష్టార్నీ, వార్నీవీర్నీ అడిగి తెలుసుకునీ, ఊహించి తేల్చుకున్న విషయాలు. ఇహ ఆ తరువాత నాకు గుంటూరులో ఉద్యోగం చేయటం ఇష్టంలేకపోయింది. రాజీనామాచేసి వచ్చేశాను. ఆ తరువాత వాల్టేర్‌లో రెండేళ్ళు ఎం.ఎ. చదివి, కాలేజీ ఉపాధ్యాయునిగా విజయవాడలో స్థిరపడ్డాను.

ఇన్నేళ్ళ తరువాత కన్పించిన రోహిణి ఆనాటి నా రోహిణికాదు. ఎవరో కొత్తవ్యక్తి. ఆమె కూడా అలాగే ఫీలవుతున్నట్లుంది. ఏం మాట్లాడాలి. ఏం మాటలు మిగిలాయి మాట్లాడుకోవటానికి? పలకరించుకోవటం, గుర్తుపట్టడంతో అయిపోయాయి మాటలు.

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వస్తుందని మైక్‌లో అనౌన్స్ చేశారు. నేను పళ్లబుట్ట తీసుకెళ్ళి రోహిణి పిల్లలకిచ్చాను. ''ఎందుకివ్వన్నీ'' అంది.

''మీ బండి వస్తోంది'' అన్నాను ఏం జవాబివ్వాలో తోచక.

ట్రైన్ ప్లాట్‌ఫాంమీద కొచ్చేసింది. చంద్రశేఖర్ ఓ పెట్టెలోనుంచి చేయి ఊపాడు. బండి ఆగటంతో జనం దిగటం మొదలెట్టారు. చందూనేనున్న దగ్గరకొచ్చేశాడు.

''నువ్వేం మారలేదోయ్- అలాగేవున్నావు'' అన్నాను.

''మారకపోవడమేం. కళ్ళజోడొచ్చింది. మనిషి కొంచెం స్థూలం అయాను'' అన్నాడు నవ్వుతూ.

''ఇహ మేం వస్తాం సారథీ!!'' అంది రోహిణి పిల్లల్ని బండి ఎక్కమని చెప్తూ.

''సరే... మా ఇంటికొస్తే బాగుండేది'' అన్నాను. నిజంగా ఆమె మా ఇంటికి రావటానికి అంగీకరించినట్లయితే నేను చాలా ఇబ్బందిలో పడిపోయేవాడిని. ఆమె తోడి పూర్వపరిచయాన్ని కాదనలేను. ఇప్పుడు ఆ పరిచయాన్ని కొనసాగించనూలేను. ఆమె పరిస్థితీ అదే. ఒకళ్ళకొకళ్ళం కొత్తవాళ్ళం. కొత్తవాళ్ళ మధ్య మాటలేం వుంటాయి!

ఆమె సామానులు బండిలో పెట్టాను.

''ట్రైను కదిలింతరువాత మనం బయలుదేరుదాం'' అన్నాను చందూతో.

''అలాగే'' అన్నాడతను.

''ఎందుకు మీరు వుండటం, పదండి- ఇప్పటికే ఆలస్యమయింది'' అంది రోహిణి.

''ఏం ఫరవాలేదు'' అన్నాను నేను.

''కాదులే పదండి, పిల్లలూ అంకుల్‌కి టాటా చెప్పండి'' అంది.

ఇహనేనేం మాట్లాడలేదు. ''సరేవస్తా''మని చెప్పి చందూతో బయలుదేరాను.

చంద్రశేఖరం ప్రస్తుతం బాంకులో ఆఫీసరు. బాంకులో చేరకముందు మా కాలేజీలో ఓ సంవత్సరం డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేశాడు. తరువాత ప్రొబేషనరీ ఆఫీసరుగా సెలక్టవటం, అతను వెళ్ళిపోవటం జరిగింది. అతనికి వెంట వెంటనే ప్రమోషన్లు వచ్చాయి. ఇప్పుడతను బాంకులో చాలా పెద్ద ఆఫీసరు. విజయవాడ బ్రాంచి తనిఖీకొచ్చాడు. మళ్ళీ రేపే వెళ్లిపోతాడట.

అతను మా కాలేజీలో పనిచేసే రోజుల్లో నేనూ, కృష్ణమూర్తి, చంద్రశేఖరం ఆప్తమిత్రుల్లాగ

వుండేవాళ్ళం. అప్పటికే నా పెళ్ళయింది. అయినా విజయవాడ రోడ్లు సర్వేచేస్తూ ముగ్గురం రాత్రి పదిగంటలదాకా కాలం గడిపేవాళ్ళం. సాహిత్య సమావేశాలేమయినా జరిగితే హాజరయేవాళ్ళం. మేం కలిస్తే మాటలకు కొదువ వుండేదికాదు.

స్టేషను బయటకొచ్చి ఆటో ఎక్కాం. అతను చెప్తున్నాడు- బాంకులో జరిగే ఫ్రాడ్‌లు, ఎవరు ఎలా తెలివిగా తప్పించుకోవటానికి ప్రయత్నం చేసేదీ, తనెలా వాటిని పట్టుకున్నదీ.

''మన కృష్ణమూర్తికి మాసివ్ హార్ట్ అటాక్ వచ్చింది. పొద్దుటినుండి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచారు. డాక్టర్లు ఏం చెప్పటంలేదు'' అన్నాను.

''అయ్యో అలాగా! ఇంతకుముందు ఆరోగ్యంగానే వుండేవాడే. ఈ హార్ట్ కంప్లైంట్ ఎప్పటినుండి డెవలప్ చేశాడు?'' అడిగాడు.

''ఇంతకుముందు రెండుమూడు సార్లు వచ్చింది డాక్టర్లు జాగ్రత్తగా వుండమని సలహాలిచ్చారు. అయినా మన జాగ్రత్తలేం పనిచేస్తాయి? నిన్న రాత్రి వచ్చింది మళ్ళీ హార్ట్ అటాక్''

ఆ తరువాత మా కాలేజీలో అతను పనిచేసే రోజుల్లో స్టాఫ్‌మెంబర్ల గురించి ఎవరు ఎలా వున్నారో అడిగాడు. అంతే మాటలయిపోయాయి. అలా అని అతను మాట్లాడటం మానలేదు. బాంకులు, దేశప్రగతిలో బాంకులపాత్ర, ఏ పద్ధతిలో బాంకింగ్ నిర్వహించాల్సిందీ మాట్లాడుతున్నాడు. ఇదంతా అతనికి సంబంధించిన విషయం. నాకు కొత్తప్రపంచం. మా ఇద్దరికీ సంబంధించిన ప్రపంచంకాదు. మా పాతస్నేహాన్ని గుర్తుచేసే మాటలు, హృదయాల్ని విప్పిచెప్పుకునే మాటలేం జరగలేదు. ఇంటికొచ్చాం. స్నానం భోజనాలయినాయి.

మా ఆవిణ్ని, పిల్లల్ని పలకరించటంలాంటి నాలుగుమాటలు తప్ప, మిగతా మాటలన్నీ బాంకులగురించే చెప్తున్నాడు.

''అబ్బ... ప్రయాణంలో వళ్లు అలసిపోయిందోయ్- పడుకుందాం.'' అని కళ్ళు మూసుకున్న అయిదునిమిషాల్లో నిద్రపోయాడు చంద్రశేఖరం. మేం కలిసినప్పుడు ఎన్నిరాత్రులు నిద్రపోకుండా మాట్లాడుకుంటూ గడిపాం. ఆరోజుల్లో ఒకళ్ళు చెప్పటం మిగతావాళ్ళు వినటం అన్న పద్ధతిలేదు. అందరమూ మాట్లాడేవాళ్ళం. ఇవాళ మామధ్య చెప్పుకోవాల్సిన మాటలేం లేవు. అందుకనే అతను నిద్రపోయాడు. నాకు నిద్రపట్టక ఆలోచిస్తూ వుండిపోయాను.

ఆరోజుల్లో అతనికేసమస్య వచ్చినా నా సలహా తీసుకునేవాడు. ఇద్దరం చర్చించి ఓ నిర్ణయానికొచ్చేవాళ్ళం.

అతనికి సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగమొచ్చింది, క్లరికల్ కాడర్‌లో ''గవర్నమెంట్ జాబ్‌కదా, వెళ్ళి చేరుతానోయ్'' అన్నాడు.

''ఏం ప్రయోజనం. అదీ గుమస్తా వుద్యోగమేగా. దానికంటే ప్రస్తుతం నువ్వుచేసే డిమాన్‌స్ట్రేటరు ఉద్యోగమేనయం'' అన్నాను.

''ఇది టెంపరరీ జాబ్గా. ఎప్పుడు ఊడుతుందో తెలీదు. దీనికంటే పర్మనెంటు జాబ్‌లో చేరటం మంచిదికదూ, మా వాళ్ళూ చేరమంటున్నారు'' అన్నాడతను.

''ఎలుకతోక బెత్తెడు ఉద్యోగమెందుకోయ్. బాంకుల్లో పి.ఓ.లకూ, వాటికీ రాయరాదా!'' అన్నాను.

అతనికీ నా సలహా నచ్చింది. ఆ ఉద్యోగంలో చేరలేదు. అతనిది నెల్లూరుజిల్లా ఆత్మకూరు స్వస్థలం. ఓసారి ఊరికెళ్ళినవాడు ఓ సమస్యను వెంటపెట్టుకుని వచ్చాడు!

''చిన్నమామయ్య కూతురు శ్యామలను పెళ్ళిచేసుకోమంటున్నారు మావాళ్ళు. మామయ్యకొక్కతే కూతురు. ఆయనకు ఆస్తి, డబ్బూ కూడా చాలా వుంది. అదంతా నాకొస్తుందని మావాళ్ళ ఆశ- నువ్వేమంటావు?'' అనడిగాడు.

''నీకా అమ్మాయి అంటే ఆసక్తివుందా?'' అడిగాను.

''అలా యేంలేదు. అదసలే పెంకిఘటం. ఒక్కతే కూతురు కావటాన గారాబంచేసి నెత్తికెక్కించుకున్నాడాయన''

''సరే... చిన్నపిల్లకదా, మెల్లగా తనే మారుతుందిలే. నాసలహా అడిగావు కాబట్టి చెప్తున్నాను - ఈ మేనరికాలు చేసుకోవద్దు.''

''కాని మావాళ్ళు చాలా ఆస్తి వస్తుందని ఆశపడ్తున్నారు''

''నీకూ వున్నట్టుంది ఆ ఆశ. దబ్బుతింటామటయ్యా! నువ్వూ సంపాదిస్తూనే వున్నావుగా. మీ కుటుంబంకూడా నువ్వు డబ్బు పంపితేగాని గడవని స్థితిలో లేదుగదా!''

''అది నిజమేననుకో...'' అని సందేహిస్తూ ఆగాడు చందూ.

''సైన్స్ ప్రకారం కూడ ఈ మేనరికాలూ అవీ అంతమంచివికావు. ఈ దగ్గరి సంబంధాల వల్ల కలిగే పిల్లలు బలహీనంగా, ఒకోసారి అనేక డిఫెక్ట్స్‌తో పుడతారు. అన్ని కేసుల్లో అలా జరుగుతున్నాయని కాదనుకో. అలాంటి అవకాశం వుంది.''

''మావాళ్లేమంటారో...'' అన్నాడు చందూ ఇంకా ఆలోచనలోపడి.

''అసలు నీకూ చేసుకోవాలని వున్నట్టుంది. వాళ్లననటమెందుకు. అలాగయితే వేరే ఆలోచనలు లేకుండా పెళ్ళిచేసుకో ఆ అమ్మాయినే'' అన్నాను.

''లేదు లేదు... నువ్వన్నదీ కర్రెక్టే. మా పెద్ద మామయ్య తన కూతుర్ని మా పెద్దమ్మ కొడుక్కిచ్చాడు. వాళ్ళబ్బాయికి ఇప్పుడు ఏడేళ్ళుంటాయి. సరిగా మాటలు రావు, సరిగ్గా నడవలేదు. మెంటల్ రిటార్డేషన్. మేనరికం వల్లే అన్నారు డాక్టర్లు.''

''మరింకేం... చూస్తూ చూస్తూ నువ్వెలా చేసుకుంటావయ్యా'' అడిగాను.

అంతే.... ఆ తరువాత చందూ శ్యామలను చేసుకోనని చెప్పేశాడు తల్లిదండ్రులకు. వాళ్ళు నచ్చచెప్ప ప్రయత్నం చేశారు కాని, అతను వాళ్ళ మాటలు వినలేదు.

చందూ బాంకులో ప్రొబేషనరీ ఆఫీసరుగా చేరిన రెండు సంవత్సరాలకు ఓసారి మా ఇంటికొచ్చాడు. తిరిగి వెళ్తూ దోవలో అన్నాడు. ''నువ్వు కాలేజీ లెక్చరర్ అయినా నీ జీవన స్థాయేం పెరగలేదు. ఇంకా స్కూల్లో టీచరులాగానే వున్నావు'' అన్నాడు.

అతనికప్పటికింకా పెళ్ళికాలేదు. జీతం బాగా వస్తోంది. అతనిలా నేనెలా వుండగలను. మా అమ్మ జబ్బుపడటం, మందులు, డాక్టర్ల ఫీజులు, పెరిగే పిల్లల పెరిగే అవసరాలు, పెరగని నా జీతం, నా అవసరాలని కుదించుకోవటమే తప్ప సంపాదన పెంచుకోవాలనే ఆలోచనలేని నేను ఏం మాట్లాడలేకపోయాను.

''ఇదేం బావుండలేదు. స్టేటస్‌కు తగినట్టుండాలి. ఎప్పటి లూజుపాంటు, లూజ్‌షర్ట్. టక్ చెయ్యగూడదూ - చెప్పుల బదులు షూజ్ వేసుకుంటేనేం. చేతికి వాచీ కూడా పెట్టుకోవు'' అన్నాడు. నేనేం మాట్లాడలేదు.

ఈ చంద్రశేఖరం, నాకు తెల్సిన చందూకాదు. నాకు తెల్సు. నా ఆర్థిక పరిస్థితిని అవహేళన చేస్తూ అన్నమాటలు కావవి. నేను అతనికి పరిచయమైనప్పటినుండీ అలానే వున్నాను. అప్పుడతను నా కష్టసుఖాల్లో పాలుపంచుకునే మనిషి. నాకు డబ్బు అవసరమైనప్పుడల్లా అతనే అప్పిచ్చేవాడు. నన్ను అర్థం చేసుకున్న చందూ అతను. ఈ చంద్ర శేఖర్ ఎవరో కొత్త వాడు. నా చందూ కాదు.

పొద్దున ఏడుగంటలకు లేచాడు చంద్రశేఖరం. ఆలస్యమయిందని హడావుడి పడిపోయాడు. హడావుడిగా స్నానం వగైరా కానిచ్చి, టిఫిన్ తినటం పూర్తిచేసి బయటపడాలనుకుంటున్నాడు. అంతలో కృష్ణమూర్తి పెద్దకొడుకొచ్చాడు. వాడి వయసింకా పదహారేళ్ళు కూడా వుండదు. ఏడ్చి ఏడ్చి ముఖమంతా కందిపోయింది.

''ఏరా ఏమయింది - నాన్నెలా వున్నాడు'' అని అడిగాను.

''పోయారు, తెల్లవారుజామున నాలుగ్గంటలకు...'' అన్నాడు వాడు బెక్కుతూ.

''అయ్యో! ఎంత పనిజరిగిపోయింది'' అన్నాడు చంద్రశేఖరం కుర్చీలో కూలబడుతూ.

''నేను హాస్పిటల్‌కు వెళుతున్నాను - వస్తావా'' అన్నాను.

''సారీ సారథీ... ఇవాళ ఇన్‌స్పెక్షన్ పూర్తిచేసి వెళ్ళిపోవాలి. అక్కడ వాళ్ళంతా నాకోసం ఎదురు చూస్తుంటారు. ఐయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ'' అన్నాడతను.

మేం ఇంట్లోనుంచి బయటపడ్డాం.

''నేనూ వస్తున్నా వుండండి'' అని అరిచింది లోపలనుండి మా ఆవిడ.

''మరి నేవస్తా సారథీ! మళ్ళీ వచ్చినప్పుడు కలుస్తాను'' అంటూ చేయికలిపి, బ్రీఫ్‌కేసు చేతపట్టుకుని, చకచకా వెళ్ళిపోయాడు చంద్రశేఖరం.

మా ఆవిడ రావటంతో నేనూ, ఆవిడ, కృష్ణమూర్తి కొడుకు రామం కలిసి ఆటోలో హాస్పిటల్‌వైపు వెళ్ళిపోయాం.

చంద్రశేఖరం ఒకప్పటి మిత్రుడు కృష్ణమూర్తిని చివరిసారిగానయినా చూసే అవకాశం లేకుండా వెళ్ళిపోవటం, అతనికి కృష్ణమూర్తిపట్ల ప్రేమ, సానుభూతి లేకకాదు. అవి ఒకప్పటివి. ఇప్పుడు గుర్తులేకకాదు. ఈ పదిపెన్నెండేళ్ళ కాలంలో కొత్తతనాన్ని సంతరించుకున్న బంధమది. అతని భార్యతో ఏం మాట్లాడతాడు?

మనుషులు అనుక్షణం ఇలా కొత్తవాళ్ళయిపోతారేం. మనం ఎంతో ప్రేమగా చూసుకున్న చిన్నప్పటి మిత్రులు, పరిచయస్తులు, మళ్ళీ ఇప్పుడు మనజీవితంలో తారసపడితే వాళ్ళతో ఏం మాట్లాడగలం? ఆ జీవితంలో అప్పటి బంధాలు తెగిపొయ్యాయి. అవిసాగే అవకాశం ఇంకలేదు. పలకరింపులు, కుశల ప్రశ్నలతో అయిపోతాయి మాటలు.

''ఒరేయ్! పూర్ణా! ఈ కొత్త మాష్టారు భయపడుతున్నాడు. ఈయన్ని ఎలా ఏడిపిద్దాం'' అని నా చిన్ననాటి మిత్రుడు పూర్ణచంద్రరావు ఇప్పుడు కనబడితే అనగలనా? మన పూర్వ పరిచయస్తులు మన జీవితంలో తారసపడితే ఎంత అన్‌కంఫర్టబుల్‌గా ఫీలవుతాం? వాళ్ళని కొత్తవాళ్ళుగా పరిగణించలేకపోవటం, కొత్తవాళ్ళం కాదు పాతస్నేహితులమేనని నటించలేని అశక్తతలోనే వుంది కష్టమంతా. ఈ రోహిణి ఆ రోహిణి కాదు, ఈ చంద్రశేఖరం అప్పటి నా చందూకాదు, నేనూ వాళ్ళకు అప్పటి పార్థసారథినికాదు. ఆలోచిస్తూంటే టి.ఎస్. ఇలియట్ మాటలు గుర్తుకొచ్చాయి.

''వుయ్ డైటు ఈచదర్ డైలీ
వాట్ వుయ్‌నో ఆఫదర్ పీపుల్
ఈజ్ ఓన్లీ అవర్ మెమొరీ ఆఫ్ మూమెంట్స్
డ్యూరింగ్ విచ్ వుయ్ నోదెం''

ఆయనన్నది నిజమే - ఇతర్లను గురించి మనకు తెల్సింది, మనకు వాళ్ళు తెలిసినప్పటి క్షణాల స్మృతి మాత్రమే. కాలం కరిమింగిన వెలగపండులా ఆత్మీయత, స్నేహ మాధుర్యం నశించి పరిచయాలు జ్ఞాపకాలుగా మాత్రమే మిగుల్తాయి.

'అనుభూతి' అన్న పేరుతో 'విపుల' మాసపత్రిక
మే, 1989